కేన్సర్‌పై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు జ్ఞాపికలను అందజేస్తున్న రవికుమార్

రసూల్‌పురా: మారిన జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది అనేక రకాల కేన్సర్ల బారిన పడుతున్నారని సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ జాస్తి రవికుమార్ పేర్కొన్నారు. పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రతినిధుల సహకారంతో మంగళవారం కేన్సర్‌పై అవగాహన సదస్సు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కేన్సర్ వల్ల ప్రపంచవ్యాప్తంగా అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని డబ్ల్యూహెచ్‌వో ప్రకటించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. వ్యాయామం లేకపోవడం, అధిక బరువు ఉబకాయం కలిగిఉండడం, రక్తంలో చక్కర స్థాయిలు అధికంగా ఉండడం పొగాకు, మద్యం లాంటి కారణాలతో కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మృదుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ కే.రాజేందర్, సంధ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అడ్డగుట్ట: ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అడ్డగుట్ట ఆటో స్టాండ్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రోడ్‌సేఫ్టీ బిల్లును తీసుకొచ్చి కార్మికులను అనేక రకాల బాధలకు గురి చెయ్యాలని ప్రయత్నం చేస్తోందన్నారు. మతం పేరుతో రాజకీయాలను చేస్తూ కార్మికుల మధ్య ఐక్యత లేకుండా విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు బస్సులు ఫ్రీ కావడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కైలాష్, రాజు, బీమ్, ఎల్లయ్య, శ్యామ్, ఇబ్రహీం, సలీం, చిన్న, వెంకటేష్, సురేందర్, శేఖర్ పాల్గొన్నారు.

జెక్‌కాలనీ అభివృద్ధికి కృషి



జెక్‌కాలనీలో పర్యటిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: జెక్‌కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. జెక్‌కాలనీ నివాసితుల విన్నపం మేరకు ఆమె కాలనీలో పర్యటించి 3, 4 రోడ్లను పరిశీలించారు. కొన్ని నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును తవ్వారని, ఆ తర్వాత డ్రైనేజీ నిర్మాణం పూర్తయినప్పటికీ రోడ్ల నిర్మాణం జరపడం లేదని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా త్వరలో పనులు చేపడతామని చెప్పారన్నారు. ఆమె వెంట కంజర్ల సదాశివయాదవ్, యల్లావుల చక్రధర్ యాదవ్, గంగాధర్‌గుప్తా ఉన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనీ కోరుతూ మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, జన సమితి అధ్యక్షులు ప్రొ. కోదండరాంను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి రెండవ విడత గొర్రెల పంపిణీ చేట్టాలని వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము అశోక్‌యాదవ్, బేరి రాంచందర్ యాదవ్, సొదాని భూమన్న యాదవ్, బుచ్చన్న యాదవ్, మల్లేష్, పరుశరాం, తిరుపతి, అంజిత్ యాదవ్, ఉమేష్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కుట్రలను మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బౌద్ధనగర్: తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవీ రాకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి చైర్మన్ డాక్టర్ ఎం. భాగయ్య అన్నారు. బౌద్ధనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు చేస్తున్న కుట్రలను మానుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోదండరామ్ సముచిత స్థానం కల్పించడంలో విఫలమైందని ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తించి ఎమ్మెల్సీ పదవిని కేటాయిస్తే దాన్ని బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడం పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో యాదగిరి, పాండుగౌడ్, శంకరయ్య, వీరస్వామి, జనార్దన్ రెడ్డి, సాయిబాబా, సత్యనారాయణ, గణేష్‌రావు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర లాథూర్‌కు చెందిన విజయ్‌కుమార్ (28) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రెజిమెంటల్‌బజార్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ఆల్ఫా హోటల్ వద్ద బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపారంలో నష్టాలు రావడంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండ్రోజులుగా తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో తండ్రి మంగళవారం అద్దె ఉంటున్న ఇంటికొచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

‘గృహజ్యోతి’ సర్వే షురూ

- రేషన్, ఆధార్ నంబర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- వినియోగదారుల్లో చిగురిస్తున్న ఆశలు





విద్యుత్ మీటర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. స్థానికంగా ఉండే ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉన్నతాధికారుల నుంచి గైడ్‌లైన్స్‌తో రావడంతో మంగళవారం నుంచి ప్రక్రియ షురూ అయ్యింది. ప్రధానంగా రేషన్, ఆధార్ కార్డులను బేరీజుగా చేసుకుని గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం చుట్టారు. యజమానులు, అద్దెకుండేవాళ్ల తేడా లేకుండా విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రతి ఒక్కరి ఆధార్, రేషన్‌కార్డు నెంబర్లను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే తంతు మొదలైంది.

చిగురిస్తున్న ఆశలు..

గృహజ్యోతి పథకం కింద జరుగుతున్న సర్వేతో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నెలకు 1–200 యూనిట్లు వినియోగించే నివాసితులకు ఈ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం హామీచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 1-200 యూనిట్లు వినియోగించే గృహ వినియోగదారుల జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ముందుగా కరెంటు బిల్లు జారీ అయ్యే ప్రతి కుటుంబం నుంచి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు నెంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఆ తర్వాత వారు వాడుతున్న యూనిట్ల ఆధారంగా చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అయితే రేషన్‌కార్డు లేని వారి ఆధార్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుండడంతో ఎవరెవరిని లబ్ధిదారులుగా చేరుస్తారనే దానిపై స్పష్టత లేదు. ఎవరికి వారు తమకు లబ్ధి చేకూరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

వారికే లబ్ధి..

సనత్‌నగర్ సెక్షన్ కార్యాలయ పరిధిలో మొత్తం 27,013 గృహ వినియోగ (డొమెస్టిక్) కనెక్షన్లు ఉండగా ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల మేరకు శ్యామలకుంట, దాసారంబస్తీ, ఎస్ఆర్‌టీ, శివాజీనగర్, డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలో 23,672 డొమెస్టిక్ కనెక్షన్లు ఉండగా ఇక్కడ అమీర్‌పేట కుమ్మరిబస్తీ, రేణుకానగర్, బీజేఆర్‌నగర్, బుద్ధనగర్, సిక్‌బస్తీ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా లబ్ధిదారులు ఉండే అవకాశాలు ఉన్నాయి. బేగంపేట సెక్షన్ పరిధిలో 27,752 డొమెస్టిక్ కనెక్షన్లు ఉంటే బస్తీలు కూడా ఎక్కువగా ఇక్కడే ఉన్నాయి. వీటిలో దాదాపు 50 శాతం లబ్ధిదారులకు గృహజ్యోతి కింద లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. 1-200 యూనిట్లను పరిగణలోకి తీసుకుంటే ఎక్కువ శాతం బస్తీల్లోనే లబ్ధిదారులు ఉంటారు.

నాలాపై ఆక్రమణలను తొలగించండి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: అమీర్‌పేట గాయత్రినగర్‌లోని నాలాపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు.రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలా రీమోడలింగ్ పనులను అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. సగం పనులు పూర్తయ్యాయని, అక్రమ నిర్మాణాల కారణంగా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో రోడ్లపైకి నీరు చేరి స్థానిక ప్రజల ఇబ్బందులకు దృష్టిలో ఉంచుకుని నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎన్.శేషుకుమారి, డీసి జగన్, ఈఈ ఇందిర, మోహన్, హరి శంకర్,వంశీ,మనోహర్ ఉన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం..

వయోవృద్ధులు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు ఆరోగ్య పరిరక్షణ విషయంలో శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.సనత్‌నగర్ బీకేగూడలో గల సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆవరణలో రూ.6 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజులో కొంత సమయాన్ని జిమ్‌కు కేటాయించి తద్వారా ఆరోగ్యాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు.అంతా కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి,కౌన్సిల్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, కార్యదర్శి యాదగిరి,సహదేవ్‌గౌడ్,లింగమయ్య, మాణిక్‌రావు, అనంత్‌రెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 28, క్యారెట్ 23, దొండ 31, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 22, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నియామకం

లాలాపేట: రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన కోసం వివిధ సంఘాలు కలిసి యునైటెడ్ పూలే ఫ్రంట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా తార్నాకకు చెందిన ఆలకుంట హరిబాబు యునైటెడ్ పూలే ఫ్రంట్ యూత్ వింగ్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం

బౌద్ధనగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. రాంనగర్‌లోని బాప్టిస్ట్ చర్చి సమీపంలో నివాసముంటున్న సుమన్‌కుమార్ (48) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 5న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుమన్ మళ్లీ తిరిగి రాలేదు. దీంతో అతని భార్య కంచన్ ఫోన్ చేయగా సుమన్ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా భర్త ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



పార్కును సందర్శించిన మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట ద్వారకాదాస్ కాలనీ పార్కును అందరికీ ఆహ్లాదాన్ని పంచే కేంద్రంగా అందంగా తీర్చిదిద్దనున్నట్లు కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం ఆమె పార్కును సందర్శించి అందులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. రూ.35 లక్షలతో చేపట్టే పార్కు అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రీనరీ, పాత్‌వే నిర్మాణం, వాకర్స్ సేదతీరేందుకు వీలుగా బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ద్వారకాదాస్ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా ఆయన దృష్టికి తెచ్చిన వెంటనే అన్ని సౌకర్యాలతో పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, నరేష్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్‌లో ‘బూత్ చలో.. బస్తీ చలో’



కార్యక్రమంలో పాల్గొన్న మల్క కొమురయ్య

రసూల్‌పురా: ప్రధాని నరేంద్ర మోదీ పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు మల్క కొమురయ్య సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్‌లో మంగళవారం జరిగిన బూత్ ఛలో బస్తీ ఛలో కార్యక్రమంలో మల్క కొమురయ్య పాల్గొని మాట్లాడారు.ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, గరీబ్ కల్యాణ్ తదితర పథకాలు అమలు చేస్తున్నారని వచ్చే ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని దేశానికి సుస్థిర పాలన అందించిన మోదీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్, కిషన్‌రాజ్, షణ్ముఖం, ద శరథ్, కిషోర్, సంజయ్, వరుణ్, శేఖర్, అశోక్, డీవీ. సుబ్బమ్మ, సుదర్శన్, ఉమా, సువర్ణ, గాయత్రి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన డెబాషిష్ దాస్(32) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తన కుటుంబసభ్యులు ఫిబ్రవరి 3న డెబాషిష్ దాస్‌కు వైద్య పరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 5న తిరుగు ప్రయాణంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సోమవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని పుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్ద అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

రైల్వే డిగ్రీ కళాశాలలో గణతంత్ర వజ్రోత్సవ ఉపన్యాసం



ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొన్న మోహన్‌రావు

లాలాపేట: భారత గణతంత్ర 75 ఏళ్ల వజ్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. దీనికి ప్రభుత్వ పాలనా శాస్త్రం విశ్రాంత అసోసియేషట్ ప్రొఫెసర్ డా. పి. మోహన్‌రావు హాజరై ప్రసంగించారు. దాదాపు 200 ఏళ్ల పాటు మనదేశంలో పరిపాలన కొనసాగించిన బ్రిటీష్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఎన్నో స్వాతంత్ర్య సముపార్జన ఉద్యమాలు జరిగాయిని వివరించారు. అంతిమంగా మహాత్మా గాంధీ సత్యాగ్రహం అనే శాంతియుత ఆయుధం ద్వారా భారతదేశాన్ని దాస్య శృంకలాల నుంచి విడిపించడంలో సఫలీకృతుడయ్యాడని పేర్కొన్నారు. 75 ఏళ్ల ఉత్సవాలను జరుపుకోడంతో ఈ వజ్రోత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంస్కరణలు, మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్ తక్షణ అమలు, పార్టీ ఫిరాయింపుల చట్టంలోని లొసుగులను సవరించడం, కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై సమగ్ర చర్య తదితర అంశాలపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన ఆవశ్యతపై మోహన్‌రావు చర్చించారు.

‘రిజర్వేషన్’ బిల్లుపై నిర్ణయం తీసుకోవాలి

లిబర్టీ: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి ప్రభుత్వానికున్న అభ్యంతరం ఏమిటని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి ప్రశ్నించారు. దాదాపు 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం బీసీలకు చేసింది శూన్యమన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. బీసీ కుల గణనపై ప్రధానమంత్రి పార్లమెంటులో స్పష్టమైన ప్రకటన వెల్లడించాలని డిమాండ్ చేశారు.

చిలకలగూడ డీఐగా రమేష్‌గౌడ్



చిలకలగూడ : చిలకలగూడ ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌గౌడ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన రమేష్‌గౌడ్ కాచిగూడ ఎస్ఐగా మొదటిసారి ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. హుస్సేనీ ఆలం తదితర ఠాణాలతో పాటు స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ) సీసీఎస్‌లలో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఫిలింనగర్ డీఐగా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా చిలకలగూడ డీఐగా నియమితులయ్యారు. ఇక్కడ డీఐగా పనిచేస్తున్న శ్రీశైలం నాయక్‌ను మల్టీజోన్–2కు సరెండర్ చేసిన సంగతి విదితమే. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సరికొండ మట్టంరాజును సైబర్‌క్రైమ్ విభాగానికి బదిలీపై వెళ్లగా, మల్టీజోన్–2లో పనిచేస్తున్న పీ.ప్రవీణ్‌ను చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టేందుకు మరికొంత సమయం పడుతుందని భావించిన పోలీస్ ఉన్నతాధికారులు విధుల్లో చేరిన డీఐ రమేష్‌గౌడ్‌కు చిలకలగూడ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ, ఫ్రెండ్లీ పోలీసింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారిస్తానన్నారు.

ఓయూకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



విద్యార్థులతో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన మొదటిసారి ఓయూకు రావడంతో ఆర్ట్స్ కాలేజీలో సందడి వాతావరణం నెలకొంది. ఎన్ఎస్‌యూఐతో పాటు టీజేఎస్ విద్యార్థి విభాగం, ఓయూ జేఏసీ, టీఎస్‌జేఏసీ, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు కొత్తగా ఎంపికైన ఎమ్మెల్సీ బల్మూరికి అభినందనలు తెలిపారు. అనంతరం 57 తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఓపెన్ డిబేట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని అనేక అంశాలను చర్చించారు. వీసీ ప్రొ.రవీందర్ విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు, హాస్టల్ వసతి అధిక మెస్ బిల్లులతో పాటు మౌలిక వసతులు, లేడీస్ హాస్టల్ విద్యార్థుల రక్షణ కరువు, పెంచిన ఫీజులను రద్దు చేయాలని, గడువు పేరుతో రద్దు చేసిన సుమారు 800 మంది విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్లను పునరుద్ధరించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేసి యూనివర్సిటీలో విద్యవాతావరణాన్ని నెలకొల్పాలని, క్యాంపస్‌లో రూ.16 కోట్లతో అవసరం లేకున్న నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనులను నిలిపివేయాలని తదితర సమస్యలను బల్మూరికి వివరించారు. అరుణ్‌కుమార్, నరసింహ, రవి, యేసుబాబు, కొండారెడ్డిపటేల్, రమణ, స్వామి, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

‘గాంధీ’ ఈఎన్‌టీ హెచ్‌ఓడీగా భూపేంద్ర రాథోడ్



నియామకపత్రాన్ని అందిస్తున్న రమేష్‌రెడ్డి

గాంధీఆస్పత్రి : గాంధీ మెడికల్ కాలేజీ చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగాధిపతిగా ప్రొఫెసర్ భూపేంద్రరాథోడ్ నియమిస్తూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాథోడ్ మాట్లాడుతూ.. ఈఎన్‌టీ విభాగం ద్వారా మరిన్ని మెరుగైన వైద్యసేవలను నిరుపేద రోగులకు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, మురళీధర్ పాల్గొన్నారు.

లేజర్ షోలో జార్జిరెడ్డి, గద్దర్ చరిత్రను చేర్చాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లేజర్‌షోలో దివంగత పూర్వ విద్యార్థులు జార్జిరెడ్డి, గద్దర్ జీవిత చరిత్రను చేర్చాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన లేజర్ షోలో ఒక పార్టీ (బీజేపీ) భావజాలానికి అనుకూలంగా ఉండటం తగదన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులతో పాటు పేదల అభ్యున్నతికి త్యాగాలు చేసిన పోరాట యోధులు, అమర వీరుల చరిత్రను సైతం చేర్చాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరికి సమాన ప్రాతినిధ్యం కల్పిస్తేనే లేజర్‌షోను కొనసాగించాలని లేని పక్షంలో నిలిపివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, ఎన్.సుమంత్, కె.స్వాతి డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ఓడినా మారని తీరు: కాంగ్రెస్

అడ్డగుట్ట: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం నేర్పినా ఇంకా వారికి బుద్ధి రాలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్. యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం అడ్డగుట్టలోని చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్. యాదగిరి మాట్లాడుతూ.. బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పు చూపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఆందోళన, ఆక్రోశంతో ప్రతీ సారి తమ వంకర బుద్ధిని చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని గ్యారంటీలు అమలు జరుగుతాయని, అందుకోసమే ముందుగా 100 రోజుల సమయం అడిగారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, యాదగిరి, లలిత, సునిత, అరుణ, వెంకటలక్ష్మి, రామలీల, వీరమ్మ, లక్ష్మి, అలివేలు, పద్మ, ఉమ పాల్గొన్నారు.

ఓయూలో..



సీఐకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ఓయూ విద్యార్థి నాయకులు మండిపడ్డారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ విద్యార్థి జేఏసీ, టీఎస్ జాక్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నేతలు బాల్క సుమన్ దిష్టిబొమ్మను వేర్వేరుగా దహనం చేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమ నాయకురాలు బాలలక్ష్మీ, టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయకర్‌గౌడ్ ఓయూ పోలీసు స్టేషన్‌లో సీఐ ఆంజనేయులుకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు.

పికెట్ చౌరస్తాలో..

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నేత డీబీ దేవేందర్ (దేవుడు) అన్నారు. మంగళవారం పికెట్ చౌరస్తాలో బాల్క సుమన్ చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. బాల్క సుమన్ జైలుకెళ్లే రోజులు దగ్గరకొచ్చాయని బాల్క సుమన్ అక్రమార్జనను లెక్కలతో సహా బయట పెడతామన్నారు. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, ఇమామ్, నాగేశ్, యాదగిరి, సురేశ్ కుమార్, హరి, దాసు తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం తార్నాక చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్‌రావు వారి బానిసలు ఓటమిని జీర్ణించుకోలేక, అధికారం పోయిందనే అక్కసుతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్ యాదవ్, బ్రహ్మాజీ, అమర్‌నాథ్ గౌడ్, శ్రీరామ్ శివకుమార్, ప్రవీణ్‌కుమార్, రవి, శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, నూతన్ క్రాంతి పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ నేతల ఖండన..

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు టీపీసీసీ కార్యదర్శి యెహెజ్కెల్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓయూ ఉద్యమనాయకుడిగా చెప్పుకునే బాల్క సుమన్ కేసీఆర్ కుటుంబానికి బానిసలా ఉన్నారని కేసీఆర్ మెప్పు పొందడానికి ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379